www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 216 | మంగళవారం | 31- 12 - 2024 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## సమ సమాజ స్థాపన కోసం పోరాడాలి



3

## తాలిబన్ల కొత్త రూల్



తొలిఅడుగు డెస్క్ : అధికారంలోకి వస్తే మంచి పాలన అందిస్తామని చెప్పిన తాలి బన్లు.. ప్రస్తుతం అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. 2021 ఆగస్టులో ఆఫ్ఘాన్ ను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకున్నప్పటి నుంచి ప్రజలను తీవ్ర 2

## మెట్రో రైలు సమయ వేళల పొడిగింపు!



తొలిఅడుగు, హైదరాబాద్ :ఈ ఏడాది ముగియబోతోంది. కొత్త సంవత్సరానికి దేశ ప్రజలు స్వాగతం పలకనున్నారు. 2

### అన్ని కార్యక్రమాల్లో ప్రభుత్వ

# భాగస్వామిగా ఉంటాం

- మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల
- నైపుణ్యాభివృద్ధి.. మౌలిక వసతుల పెంపుపై సీఎం దార్శనికతకు కితాబు
- సత్య నాదెళ్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగిస్తామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో ఆయనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం భేటీ అయింది. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడి హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్య నాదెళ్లకు తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని, హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపివేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐ, 2

## కరెంటు వైర్లపై దూకిన కోతి ముగ్గురు దుర్మరణం



తొలిఅడుగు డెస్క్ : ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం ఎవరికీ సాధ్యం కాదు..! మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో ముంచుకొస్తుందో అస్సలే అంచనా 2

## జిమ్మీ కార్టర్ మృతికి ప్రధాని మోడీ సంతాపం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ (100) ఆదివారం కన్నుమూశారు. ఆయన మృతికి భారత ప్రధాని నరేంద్రమోడీ సంతాపం వ్యక్తం చేశారు. 'అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ 2

# ఏపీకి ఇది గేమ్ ఛేంజర్ అవుతోంది

### మీరే చూడండి: సీఎం చంద్రాబు



తొలిఅడుగు, అమరావతి : నదుల అనుసంధానంపై సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో.. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని సీఎం తెలిపారు. నదుల అనుసంధానం చేస్తేనే రాష్ట్రానికి ఉపయోగమని అన్నారు. 90శాతం ప్రాజెక్టులను రాష్ట్రంలో టీడీపీనే ప్రారంభించిందని చెప్పారు. తెలుగుగంగ ద్వారా నీళ్లు తీసుకొచ్చిన ఘనత టీడీపీ దక్కుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు లేకపోవడం వల్ల.. ఉత్తరాంధ్రలో నీటి సమస్య ఏర్పడిందని అన్నారు. ఏపీని కరవు రహితంగా మారుస్తామని సీఎం తెలిపారు. చరిత్ర చూసుకుంటే, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వంలోనే నీటి భద్రతకు అడుగులు పడ్డాయని అన్నారు. తెలుగు గంగతో అన్న ఎన్టీఆర్ రాయలసీమని ఆదుకున్నారని.. సాగునీరు అందిస్తే, రాయలసీమ రతనాలసీమ అవుతుందని అన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడ్డాయని.. 2

# బండి షాకింగ్ కామెంట్స్

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకుగొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలి





2

తొలిఅడుగు, కరీంనగర్: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు గొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. పుష్ -2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా ముట్టిందేమోననే అనుమానం తనకు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ఇవాళ(సోమవారం) కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా


## ఇందిరా మహిళా శక్తి ఫిష్ ట్రక్స్



తొలిఅడుగు, హైదరాబాద్ : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి చేత పలు వ్యాపారాలను ప్రారంభింప చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా సంచార చేపల విక్రయ వాహనాలను మహిళా సంఘాల కోసం సమకూర్చుతోంది. పంచాయతీ గ్రామీణాభివృద్ధి 2

# 10మంది ఐపీఎస్‌ల బదిలీ

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ




తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2021, 2022 బ్యాచ్ యువ ఐపీఎసలు పదిమందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా గ్రేహౌండ్స్‌లో ఏఎస్పీలుగా ఇంతకాలం విధులు నిర్వర్తించారు. వీరిలో కాజల్‌ను ఉట్నూరుకు, కె.రాహుల్ రెడ్డిని రాచకొండ పరిధిలోని భువనగిరికి, ఎస్.చిత్తరంజన్‌ను 2

# మంత్రి సీతక్క చొరవ

### కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల దస్త్రంపై సీఎం సంతకం



తొలిఅడుగు, హైదరాబాద్ : గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న మూడు వేల మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను సిఆర్‌టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ చేసింది. రెన్యువల్ కు సంబంధించిన ఫైలు గత కొంతకాలంగా పెండింగ్లో ఉన్న నేపథ్యంలో.. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని సిఆర్‌టి రెన్యువల్ పై అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో సీఎం రేవంత్ రెడ్డి తో మంత్రి సీతక్క భేటీ అయ్యి చర్చించారు. సిఆర్‌టి రెన్యువల్ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గిరిజన విద్యార్థుల 2

# కరెంటు వైర్లపై దూకిన కోతి

**మొదటిపేజీ తరువాయి** వేయలేం..! తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని ఘోరక్‌పూర్‌లో జరిగిన ఓ విషాద ఘటన.. మరణం మన చేతిలో లేదని రుజువు చేసింది. ఘోరక్‌పూర్‌లోని సోన్‌బర్సా మార్కెట్ ఏరియాలో జరిగిన ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక నివాసి అయిన ఓ వ్యక్తి తన కుమార్తె, మేనకోడలుతో కలిసి బైకుపై బయటికి వచ్చాడు. వారు సోన్‌బర్సా మార్కెట్ ఏరియాలోని డంపింగ్ యార్డు దగ్గరికి చేరుకోగానే.. వారి పైనున్న 11 కేవీ విద్యుత్ వైర్లపై కోతి దూకింది. దాంతో ఓ వైర్ తెగి బైక్‌పై పడింది. దాంతో ముగ్గురూ విద్యుత్ అఘాతానికి గురయ్యారు. అందరూ చూస్తుండగానే క్షణాల్లో ముగ్గురూ అగ్నికి ఆహుతయ్యారు. వారిని రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కోతి దూకడంవల్లే విద్యుత్ వైర్ తెగిపడిందని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తాలిబన్ల కొత్త రూల్

**మొదటిపేజీ తరువాయి** ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మరీ ముఖ్యంగా మహిళలపై అణచివేతను కొనసాగిస్తున్నారు. దేశంలో మహిళల హక్కులను కాలరాస్తున్నారు. తాజాగా మహిళల విషయంలో తాలిబన్లు మరో కొత్త రూల్‌ను తీసుకొచ్చారు. ఇంట్లోని మహిళలు బయటివారికి కనిపించకుండా ఉండేలా కిటికీలు ఏర్పాటు చేయొద్దని పాలకులు ఆదేశించారు. ఇంట్లో మహిళలు తిరిగే వంట గదులు, బావుల వద్ద ఎటువంటి కిటికీలు నిర్మించకూడదని స్పష్టం చేశారు. వారు కనిపించకుండా గోడలు కట్టాలని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మించబోయే ఇళ్లల్లో ఈ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని తాలిబన్ సుప్రీం లీడర్ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహిళలు బయటకు కనిపించేలా నిర్మాణాలు ఉంటే వాటికి ఈ నిబంధనల ప్రకారం మార్పులు చేయాలని ఆదేశించారు. 2021లో ఆఫ్గానిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకున్న తాలిబన్లు మహిళలపై కఠిన ఆంక్షలు కొనసాగిస్తున్నారు. పురుషులు వెంట లేకుండా మహిళలు ఇండ్ల నుంచి బయటకు రావడానికి వీల్లేదని, బాలికల సెకండరీ స్కూళ్లు మూసివేయాలని, మహిళలు ఉద్యోగాలు చేయకూడదని ఆదేశించారు. మహిళల ఉన్నత చదువులపై, ఈద్ వేడుకల్లో పాల్గొనడం, జిమ్‌లు, పార్కుల్లోకి మహిళల ప్రవేశంపై నిషేధం విధించారు. ఈ ఆంక్షలపై ఐక్యరాజ్య సమితి ఇప్పటికే పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది స్త్రీలపై దారుణ వివక్ష అని మండిపడింది.

# మెట్రో రైలు సమయ వేళల పొడిగింపు!

**మొదటిపేజీ తరువాయి** కొత్త ఏడాది ముగింపులో డిసెంబర్ 31న అందరు ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుతూ పార్టీలతో మునిగి తేలుతుంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. న్యూఇయర్ సందర్భంగా మెట్రో రైలు వేళలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రేపు అర్ధరాత్రి 12: 30 గంటలకు వరకు మెట్రో సర్వీసులు కొనసాగనున్నాయి. కొత్త సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31న వేడులకు జరుపుకొనే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హైదరాబాద్ మెట్రో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా మరిన్ని మెట్రో రైళ్లను నడపున్నట్లు తెలిపింది. అర్ధరాత్రి వరకు వేడుకలు జరుపుకొని సురక్షితంగా ఇంటికి వెళ్లేందుకు ఈ సమయం వేళలు పొడిగించినట్లు తెలుస్తోంది.

# జిమ్మీ కార్టర్ మృతికి ప్రధాని మోడీ సంతాపం

**మొదటిపేజీ తరువాయి** కార్టర్ గొప్ప రాజనీతిజ్ఞుడు. ఆయన ప్రపంచ శాంతి, సామరస్యం కోసం అవిశ్రాంతంగా పనిచేశారు. భారత్– అమెరికా ఇరు దేశాల మధ్య బంధాలను పెంపొందించేందుకు ఆయన కృషి చేశారు. ఆయన కృషి ఇరు దేశాలకు శాశ్వత వారసత్వాన్నిచ్చింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు అమెరికా ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, జిమ్మి కార్టర్ 1978లో భారత్ పర్యటించారు. అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, ప్రధాని మొరార్జీ దేశారులను కార్టర్ కలిశారని, ఆ సందర్భంగా భారత పార్లమెంటునుద్దేశించి కూడా ఆయన ప్రసంగించారని మోడీ గుర్తు చేశారు.

# అన్ని కార్యక్రమాల్లో ప్రభుత్వ భాగస్వామిగా ఉంటాం

**మొదటిపేజీ తరువాయి** క్లౌడ్‌తో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్లకు విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూని వర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటు లో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారు దల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికు మారి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.



# ఏపీకి ఇది గేమ్ ఛేంజర్ అవుతోంది

**మొదటిపేజీ తరువాయి** ప్రణాళికతో నీటిని స్టోరేజ్ చేశామని చెప్పారు. 'ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో 74% నీళ్ళు ఉన్నాయి. జనవరి నెలలో ఇంత నీరు ఉండటం ఓ చరిత్ర. తెలుగు గంగ ద్వారా నీళ్లు ఇచ్చింది టీడీపీనే. ఏపీని కరువు రహిత ప్రాంతంగా చేంజ్ చేస్తాం. ఏపీని కరువు రహితంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలో తెలుగంగ ప్రాజెక్టు ఏపీకి గేమ్ చేంజర్.. పట్టిసీమ వచ్చిన తర్వాత పంటలకు కృష్ణా నీళ్ళు తగ్గాయి.. గోదావరి నీరు వస్తున్నాయి' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# మంత్రి సీతక్క చొరవ

**మొదటిపేజీ తరువాయి** భవిష్యత్తు దృష్టిలో సిఆర్‌టి రెన్యువల్ ఫైల్ పై వెనువెంటనే సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేశారు. గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో మూడు వేల మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను రెన్యువల్ చేసినందుకు మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

# 10 మంది ఐపీఎస్‌ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి** ఆసిఫాబా ద్‌కు, బి.చైతన్య రెడ్డిని కామారెడ్డికి, పందెర చేతన్ నితిన్‌ను జనగామకు, విక్రాంత్ కుమార్ సింగ్‌ను భద్రాచలానికి, ఎన్.శుభం ప్రకాశ్‌ను కరీంనగర్‌కు, రాజేశ్ మీనను నిర్మల్‌కు, పి.మౌనికను దేవరకొండకు బదిలీ చేశారు. భద్రాచలం ఏఎస్పీగా ఉన్న అంకిత్ కుమార్ సంఖ్వార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బండి షాకింగ్ కామెంట్స్

**మొదటిపేజీ తరువాయి** బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ ఎందుకు పెట్టారంటే.. అల్లు అర్జున్ కోసం అన్నట్లుగా ఉందని విమర్శించారు. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చెడిందని ఆరోపించారు. ఒక వ్యక్తి గురించి ఇంతగా అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరం ఏంటని బండి సంజయ్ నిలదీశారు. కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం జరుగుతోందని బండి సంజయ్ విమర్శించారు.

# ప్రేమికుల ఆత్మహత్య..!

తొలిఅడుగు, నవాబ్‌పేట : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలలో ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామంలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన చాకలి అంకిత (18) పాలమూరు ఎన్టీఆర్ మహిళా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నది. అదే గ్రామానికి చెందిన చందుకుమార్ (20) జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతుండగా.. ఇద్దరూ రెండేండ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో అంకిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలిసిన చందు మనస్తాపంతో అదే రోజు రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం మృతి వార్త వ్యాపించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇద్దరి



కుటుంబ సభ్యులు వేర్వేరుగా ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విక్రమ్ తెలిపారు.

# ఇక ఇందిరా మహిళా శక్తి ఫిష్ ట్రక్స్

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో సంచార చేపల విక్రయ వాహనాలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిద్ధం చేస్తోంది. జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 32 వాహనాలను మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు.రూ. 10 లక్షల విలువ గల ఈ వాహనాలను కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి మత్స్య యోజన పథకంతో అనుసంధానం చేసి.. 60 శాతం సబ్సిడీతో నాలుగు లక్షల రూపాయలకే మహిళా సంఘాలకు కేటాయించనున్నారు. ఈ నాలుగు లక్షల రూపాయలను సైతం గ్రామీణ పేదరిక నిర్మూలన సంఃు బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలను ఇప్పించనుంది. సంచార చేపల విక్రయం కోసం మహిళలకు అవసరమైన ట్రైనింగును గచ్చిబౌలిలోని నిథం ఇనిస్టిట్యూట్లో మహిళా సంఘాలకు ఉచితంగా శిక్షణ ఇప్పించింది. చేపల విక్రమ్ తో పాటు, నోరూరించే చేపల వంటకాలు తయారీకి అవసరమైన శిక్షణ ను సహకారంతో పలు మహిళా సంఘాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సంచార చేపల విక్రయ వాహనంలో ఉదయం పచ్చి చేపలను విక్రయించవచ్చు. సాయంత్రం చేప వంటకాలను తయారుచేసి విక్రయించుకునే విధంగా వాహనాలను ప్రత్యేకంగా తయారు చేయించారు.

# రాష్ట్రంలో మళ్లీ పెరుగుతున్న చలి

తొలిఅడుగు, హైదరాబాద్ : రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతోంది. రాబోయే ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గడిచిన వారం పది రోజులుగా తుపాన్ ప్రభావంతో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14–22 డిగ్రీల మధ్య నమోదు అయ్యాయి. చలి తీవ్రత పెద్దగా కనిపించలేదు. ఆదివారం రాత్రి నుంచి మళ్లీ పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 11 డిగ్రీలకు పడిపోయాయి. 14 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11–15 డిగ్రీల మధ్య నమోదు అయ్యాయి. ఆదివారం రంగారెడ్డి జిల్లా చందనవల్లిలో 11.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సీఎం రేవంత్ రెడ్డి తన సొంత జేబులోంచి నాలుగు కోట్ల రూపాయలు ఇవ్వాలి

**– యు ఎస్ ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు**

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న చర్చిలో క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న అనంతరం ఏడుపాయల వనదుర్గమ్మ గుడిలో అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెద్ద ఫ్లెక్సీలను రోడ్లకు ఇరువైపుల విద్యుత్ తీగల కు పక్కనే ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీ ల యొక్క ప్రేమ్ లకు తగిలి కిష్టాపూర్ గ్రామానికి చెందిన నవీన్ మరియు ప్రశాంత్ లు విద్యుత్ షాక్ కు గురై మరణించడం జరిగింది. ఈ ఘటనపై భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు మాట్లాడుతూ అల్లు అర్జున్ రావడం వల్ల తొక్కిసలాట జరిగి రేవతి గారు మరణించడం జరిగింది. ఇదేవిధంగా రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటించడం వల్ల అక్కడి కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ల వల్ల ఈ యువకులు మరణించారు కాబట్టి వారి మరణానికి పరోక్షంగా ప్రధాన కారణం అయినటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన జేబులోంచి సొంత డబ్బులు నాలుగు కోట్ల రూపాయలను విద్యుత్ షాక్కు గురై మరణించిన నవీన్, ప్రశాంత్ ల కుటుంబాలకు ఇవ్వాలి అలాగే తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ ఈ ఘటనకు రేవంత్ రెడ్డిని ముద్దాయిగా చేర్చి కేసు విచారణ జరపాలని అన్నారు. దీని ద్వారా చట్టం ముందు అందరూ సమానులే అని ప్రజలందరూ భావించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిపక్షాలు కూడా రేవంత్ రెడ్డి నాలుగు కోట్ల రూపాయలు చెల్లించేదాకా పోరాటాలు నిర్వహించాలని కోరారు.



## ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక

**– ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా పడిగె ప్రశాంత్ ముదిరాజ్**



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి గ్రామం ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షుడిగా పడిగె ప్రశాంత్ ముదిరాజ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం సభ్యులు అదేవిధంగా కార్యదర్శిగా పడిగె వంశీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పడిగె ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ నాకు వచ్చినటువంటి అవకాశాన్ని ముదిరాజ్ సమాజం కోసం కృషి చేస్తానని అన్నారు ముదిరాజ్ జాతి అభ్యున్నతికి పాటుపడతానని ముదిరాజ్ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఉన్నారు ఈ కార్యక్రమంలో కోశాధికారి పడిగె బాలకిషన్, రెడ్డి రాజు, రెడ్డి శ్రీనివాస్, సంతోష్, నవీన్,స్వామి, హరిదాస్, చిన్న వెంకటి,రాజయ్య,స్వామి,బాల మల్లు, రాజు,రాజేశం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై అవగాహన సదస్సు

**– చిన్నకోడూరు ఎస్పై బాలకృష్ణ**




తొలి అడుగు, చిన్నకోడూరు, డిసెంబర్ 30 : మండల పరిధి రాముునిపట్ల గ్రామంలోని రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ ,ఎస్టీ జిల్లా కన్వీనర్ తాజా మాజీ సర్పంచ్ జేరిపోతుల శ్రీనివాస్,ఎస్సై బాలకృష్ణ, మాట్లాడుతూ పౌరుల హక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. హక్కులను ఎలాంటి భంగం కలిగిన చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధన కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఐ. మల్లికార్జున్,మాజీ ఉపసర్పంచ్ బొల్లం కుమార్ , బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల పరుశరాములు, బిజెపి పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్, గణేష్,పంచాయతీ కార్యదర్శి కవిత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపన కోసం పోరాడాలి

**– ముఖ్య అతిథి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్**



తొలిఅడుగు, జనగామ, డిసెంబర్ 30 : జనగామ మండల కేంద్రంలో నెహ్రూ పార్క్ వద్ద ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అనంతరం ఎస్ఎఫ్ఐ జనగామ మండల కార్యదర్శి మావిడల రమేష్ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్ మాట్లాడుతూ ... 1970లో డిసెంబర్ నెలలో ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో ఏర్పడిందన్నారు విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం గా అవతరించిందన్నారు నాటి నుండి నేటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు వెళుతుందన్నారు దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్య రంగాన్ని దెబ్బతీసే కుట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నర దగ్గరికి వస్తున్న కూడా ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య సమస్యలను బాగుచేయలన్నారు లేదంటే దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారు అన్నారు విద్యార్థి అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకపోతామని అన్నారు ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలపై సవితి తల్లి ప్రేమను చూపిస్తే సరైన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మురళీకృష్ణ నాయకులు అర్జున్ రాహుల్ అర్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ పోటీలలో ప్రతిభ చాటిన వాణి నికేతన్ విద్యార్థులు.

**– రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రక్షిత్ రెడ్డి.**

తొలి అడుగు, ఇల్లంతకుంట, డిసెంబర్ 30 : ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్ విద్యార్థులు అబాకస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో బొమ్మకంటి రక్షిత్ రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తీగల అవంతిక, మామిడి అరవింద్, కూనబోయిన అద్వైత్, పిల్లి జాహ్నవిలు తమ తమ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచి బహుమతులు అందుకున్నారు. హసిత్, అమూల్య, వాత్సల్య, సల్మాన్, సహస్ర, అనురాగ్ రెడ్డి, శ్రీనిత, సమన్విత శ్రీ, సాత్విక, ఆరుష్, అర్జున్, అద్విత్, అయేషా తస్లీమ్, మనుష్ లు ప్రశంసా పత్రాలు పొందారు. పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, అబాకస్ ఉపాధ్యాయులు తీగల రమేష్, మామిండ్ల రాజు, కొడిముంజ సుమంగళి, ఈదుల రాజులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ను అవమానపరిచిన హెూం శాఖ మంత్రి అమిషాను మంత్రి పదవి నుంచి భర్తరాఫ్ చేయాలి

– సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్



తొలిఅడుగు, జనగామ, డిసెంబర్ 30 : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం జనగామ: స్థానిక అంబేద్కర్ సెంటర్లో కేంద్ర హెూం శాఖ మంత్రి (అమిత్ షా) పార్లమెంట్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ తో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్లమెంట్లో జరిగిన సమావేశాలలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ ని అవమానపరిచేలా పదేపదే అంబేద్కర్ అనే బదులు దేవుని పేరును వాడితే పుణ్యమైనా వస్తుందని అంబేద్కర్ ని అవమానపరిచేలా మాట్లాడడం వారి రాజకీయ జీవితానికే అవమానం అన్నారు అంబేద్కర్ లేకుంటే తను మంత్రి అయ్యే అవకాశం లేదని తనకంటూ ఒక హెూదా కలిగిందంటే అంబేద్కర్ ఇచ్చిన వరమే అన్నారు అలాంటి అంబేద్కర్ ని అవమానపరచడం అంటే ప్రజాస్వామ్యాన్ని కించపరచడమేనాని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు కాబట్టి మోడీ గారు ఇప్పటికైనా ఇలాంటి వ్యక్తులను పదవి నుంచి భర్తరాఫ్ చేయాలని డిమాండ్ చేశారు అమిత్ షా తక్షణం ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే రాబోయే రోజుల్లో మతోన్మాదులపై ప్రజలు కన్నెర్ర చేసి బుద్ధి చెప్తారని కచ్చితంగా బిజెపి ప్రభుత్వాన్ని గద్ద దింపే రోజులు దగ్గర పడ్డాయి అన్నారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు అంబేద్కర్ అంటే ఒక వ్యక్తి కాదని 140 కోట్ల జనాల నాయకుడని అలాంటి వ్యక్తిని అవమానపరచడం సిగ్గుమాలిన చర్య అన్నారు తక్షణం ఆయన అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అడుగడుగునా బిజెపి ఎంపీలను ఎమ్మెల్యేలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు లిఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి పి ఉపేందర్ రామావత్ మిథ్యా నాయక్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దడిగ సందీప్ నాయకులు అజ్మీర సురేష్ నాయక్ కళ్యాణ లింగం తాండ్ర ఆనందం ఎండి మైబిలి కనుకచారి ఓద్య నాయక్ మేడే నరసింహ సుధాకర్ రమేష్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు

తొలిఅడుగు, జనగామ, డిసెంబర్ 30 : హైదరాబాద్ కు చెందిన వారు జనగామ అమ్మ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో చూస్తూ బోగం తిరుమల్ యమున దంపతుల కుమార్తె విధాత్రి మొదటి పుట్టినరోజు సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసరమడ్ల అతిథి స్వగృహంలో చిన్న పిల్లల ఆశ్రమంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్టేషనరీ కిట్ లు అందజేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది.

జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్ ముఖ్య సలహా దారులు వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ ... పుట్టినరోజు జరుపుకుంటున్న విధాత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల్ యమునకు అమ్మ ఫౌండేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు మరియు అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు..



# ఏడాదిలో సీఎం రేవంత్ మార్క్ పాలన

– సాదుల పవన్ కుమార్



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రగతి బాటలో ప్రయాణిస్తుందని, ఆరు గ్యారంటీ అమల్లో సీఎం రేవంత్ రెడ్డి తన మార్క్ పాలనను చూపించారని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డి అడుగుపెట్టిన నాటి నుంచి సీఎం అయ్యే వరకూ విశ్రమించకుండా పార్టీ కోసం పని చేశారనీ, ముఖ్యమంత్రి అయిన తరువాత తనదైన మార్క్ పాలనతో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఒకే విడతలో రూ 2 లక్షల వరకు రైతు రుణ మాఫీ చేసి కొత్త రికార్డు నెలకొల్పారనీ, అదే విధంగా దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ సమయంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత రేవంత్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మూసి, రివర్ ఫ్రంట్, ఫోర్త్ సిటి, రీజినల్ రింగ్ రోడ్ వంటి పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారనీ, మూసి ప్రక్షాళన లక్ష్యంగా చేపట్టిన మూసి రివర్ ఫ్రెండ్ ప్రాజెక్ట్ మొత్తం హైదరాబాద్ నగరానికి కొత్త కళ తీసుకొని వస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలో రాజీవ్ ఆరోగ్య శ్రీ , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, వ్యవసాయానికి ఉచిత కరెంటు వంటి హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ అభివృద్ధి దిశలో ప్రయాణిస్తుందని పవన్ కుమార్ పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేరుతో వేరు వేరుగా గురుకులాలు పాఠశాలలు ఉన్నాయనీ, వాటిని ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట ప్రతి నియోజకవర్గంలో ఒకటి నిర్మించాలని సీఎం రేవంత్ యోచిస్తున్నారని తెలిపారు.

# జాతీయ సేవరత్న, జాతీయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రత్న కార్మిక రత్న అవార్డు గ్రహీతులకు సన్మానం



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : దుబ్బాక పట్టణం లో జనత మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన జిల్లా వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న కుంభాల రవీందర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న గుర్రాల శ్రీనివాస్, నేషనల్ కార్మిక రత్న అవార్డు అందుకున్న సుంకరి యాదగిరి, జిల్లా వినియోగదారుల ఫోరం ఆద్వర్యంలో ఘనంగా శాలువతో సన్మానం చేయడం జరిగిందన్నారు. వినియోగదారులు ఫోరం అధ్యక్షులు కుంభాల రవీందర్, గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ ... జిల్లాలో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. రానున్న రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణ జిల్లా వ్యాప్తంగా కమిటీని వేసి ప్రజలను చైతన్యం చేసి అందుబాటులో ఉండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. వినియోగదారుల ఫోరం జిల్లా వ్యాప్తంగా కమిటీలు వేసి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను అధికారులతో పరిష్కరిస్తామని అన్నారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షులు మూర్తి నరేష్ రెడ్డి, ఎండి రయానా బేగం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాలను బహుకరించారు. ఈ సన్మాన సభ ఏర్పాటు చేసిన జిల్లా వినియోగదారుల ఫోరం కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం జనరల్ సెక్రెటరీ గంభీర్ రావు, అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి దోసల లాలయ్య, ఈసీ మెంబర్ దుబ్బాక పరశురాములు, కొంగరి ఎల్లారెడ్డి దోస, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

– సిపి డాక్టర్ అనురాధ



తొలిఅడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : ముందస్తుగా సిద్దిపేట జిల్లా ప్రజానీకానికి పోలీస్ శాఖ వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు నూతన సంవత్సర వేడుకల్లో ఆనంద ఉత్సవాలతో జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ అన్నారు. ప్రతి ఇంట వినోదం విషాదంగా మారకుండా వేడుకలు జరుపుకోవాలని ప్రతి ఒక్కరు ప్రభుత్వం వేధించిన నియమాలను పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు త్రిబుల్ రైడింగ్, అతివేగం చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నూతన సంవత్సర ఒకటవ తారీకు వేడుకల లో మీ కుటుంబాలకు విషాద ఘటనలకు గురికాకుండా చూసుకోవాలన్నారు.

## నంది అవార్డు అందుకున్న వాణినికేతన్ ఉపాధ్యాయుడు.



తొలి అడుగు, ఇల్లంతకుంట, డిసెంబర్ 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని ముస్కానిపేట గ్రామానికి చెందిన తునికి తిరుపతి ఇల్లంతకుంట లోని వాణి నికేతన్ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఎన్ని ఆర్థిక సమస్యలు వచ్చిన అధైర్య పడకుండా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో జరుగుతున్నటువంటి సాహితీ సమావేశాల్లో పాల్గొని చక్కని కవితలు కథలు, ఏకపాత్రాభినయాలతో కవుల మనసులను గెలుస్తూ వస్తున్నారు. తను రాసినటువంటి కవితలు, కథలను, మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారికి పంపించగా పంపించినటువంటి కవితలను, కథలను సంస్థ వారు క్షుణంగా పరిశీలించి నంది అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్ బిర్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన సాహిత్య వేదికపై తునికి తిరుపతికి మెగా హెల్పింగ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు శిరీష రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, సినీ నటులు పృథ్వీరాజ్ చేతుల మీదుగా తిరుపతికి నంది అవార్డు అందించారు. నంది అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని సాహిత్యం పై మరింత పట్టు సాధించి మరెన్నో విజయాలు సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు సహకరిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డికి ప్రిన్సిపాల్ శ్రీనిధికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్.



తొలి అడుగు, ఇల్లంతకుంట, డిసెంబర్ 30 : ఇల్లంతకుంట మండల విద్యా వనరుల కేంద్రం సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఇల్లంతకుంట మండల స్థాయిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ,మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలలకు చెందిన 10 వ తరగతి విద్యార్థులకు భావి భారత పౌరులను తీర్చిదిద్దడం లో సోషల్ స్టడీస్ ఆవశ్యకతను ఇల్లంతకుంట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎం. ప్రేమలత వివరించి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. జిల్లా పరిషత్ పాఠశాలల ఇంగ్లీషు మీడియం విభాగంలో జి. అమిత ( గాలిపల్లి) జి.భావన( జడ్పీహెచ్ఎస్ దాచారం), బి. దయాసాగర్ (జడ్పీహెచ్ఎస్ గాలిపల్లి), మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్(ఇంగ్లీషు మీడియం)విభాగంలో టీజీఎంఎస్ రహీంఖాన్ పేట్ పాఠశాలకు చెందిన సీహెచ్.. శ్వేతారెడ్డి, కె. దివ్య. వి. వర్షిణి అత్యుత్తమ మార్కులు సాధించి మండల స్థాయిలో మెదటి మూడు స్థానాలు పొందారు. గెలుపొందిన పాఠశాలల విద్యార్థులను జనవరి 4వ తేదీన జిల్లాస్థాయిలో జరిగే సోషల్ టాలెంట్ టెస్ట్ కు పంపనున్నట్లు మండల విద్యాధికారి సి,హెచ్.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ టెస్ట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ ను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం. ప్రేమలత చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమం లో రాజన్న సిరిసిల్ల జిల్లా సోషల్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి కె. రాజకుమార్, సోషల్ ఫోరమ్ మండల బాధ్యులు పి. అనిల్ కుమార్, కె. రమేష్, మండలంలోని సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను భర్త్ రఫ్ చేయాలి

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అంబేద్కర్ పేరును ఉచ్చరిస్తూ చేసిన అహంకారపూరిత వాఖ్యల పట్ల తలారి నగేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అనడం ఫ్యాషన్ అయిపోయిందని, ఏదో వందసార్లు భగవంతుడు పేరు ఉచ్చరించిన సరిగా రూపంలో స్థానం దొరుకుతుందంటూ అమిత్ షా సాక్షాత్తు రాజ్యసభలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును ఉచ్చరిస్తూ అనుచిత వాక్యాలు చేశారన్నారు. అంబేద్కర్ పేరును ఉచ్చరించడమే నేరమన్నట్లు అసహనం ప్రదర్శించారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అంటే అంబేద్కర్ అవమానించడం అంటే దేశ ప్రజల్ని అవమానించడమేనన్నారు. బిజెపి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది అన్నారు. ప్రతిపక్షాల అభ్యంతరం దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన కూడా కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పక పోగా విపక్షాలపై విరుచుకోవడం హెూం మంత్రి ఆయన పరివారం వివరించడం సిగ్గుచేటు అన్నారు. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగం రూపొందించుకునే సమయంలోనే బిజెపి మాతృ సంస్థ అయినా రాష్ట్రీయ స్వయం సేవా సంఘం (ఆర్ఎస్ఎస్) రాజ్యాంగ అంబేద్కర్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిందన్నారు. అవకాశం ఇచ్చిన ప్రతిసారి రాజ్యాంగంపై విరుచుకుపడడం, రాజ్యాంగం స్థానంలో మనస్మృతిని అమలు చేసే కుట్రలో భాగమే ఈ వాక్యాలని అన్నారు. 224 లోక్సభ ఎన్నికల సందర్భంలో 400 సీట్లు సాధిస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మార్చి తీర్థం అంటూ బిజెపి అగ్రనాయకత్వం బాటంగా ప్రకటించింది అన్నారు. తీరా నోటితో నవ్వి నోసటితో వెక్కిరించినట్టు సీటు వచ్చేసరికి ఈ విధంగా బిజెపి అంబేద్కర్ పట్ల వ్యవహరిస్తుందన్నారు. రాజ్యాంగ సంస్థలను కూడా నిర్వీర్యం చేసిందన్నారు. ఇప్పటికైనా దేశవ్యాప్త నిరసనలను పర్యాలోకి తీసుకొని ప్రధానమంత్రి కేంద్ర హెూంమంత్రి పదవి నుండి అమీత్ షాను భర్త్ రఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## మృతిని కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : నంగునూరు మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన నాగిల్ల రాజయ్య ఆదివారం రోజున మరణించడం జరిగింది విషయాన్ని తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ కు తెలియజేయడంతో మృతుని కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నంగునూరు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివప్రసాద్ గౌడ్ కుల పెద్ద మనుషులు యాదగిరి, రామచంద్రం, హరిబాబు, నరేష్, ఐలయ్య, ప్రశాంత్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు సాయి శ్యామ్ , రాకేష్, చందు, శివ , అఖిల్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పేర్లు వచ్చేలా చూడాలని వినతి

తొలిఅడుగు, జనగాం, డిసెంబర్ 30 : సోమవారం రోజున వీవర్స్ కాలనీ 12వ వార్డ్ లో కొంత మంది ప్రజాపాలనలో ఇందిరమ్మ గృహాలు, 5లక్షల రుణాల కోసం దరఖాస్తు చేసిన వారి పేర్లు ప్రస్తుతం12వ వార్డ్ లో పరిశీలన జరుగుతుందని ఆ జాభితాలో పేర్లు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తు దారుల పేర్లు సర్వేలో వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక 12వ వార్డ్ కౌన్సిలర్ గుఱ్ఱం భూలక్ష్మి నాగరాజు ఆధ్వర్యంలో జనగామా జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో దరఖాస్తులు ఇవ్వడం జరిగింది



## ఘనంగా అయ్యప్ప పడిపూజ జరిపించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



తొలి అడుగు, ధర్మపురి, డిసెంబర్ 30 : ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప 18 మెట్ల పడిపూజ నిర్వహించారు. పడి పూజకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, పెద్దపెల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, అయ్యప్ప స్వాములు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ధర్మపురి నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అయ్యప్పను వేడుకున్నానని తెలిపారు.

# బి.ఆర్.అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి - సిపిఎం.

తొలి అడుగు పరవాడ డిసెంబర్ 30 : భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం దేశవ్యాపితంగా వామపక్ష పార్టీల నిరసనల్లో భాగంగా పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద సిపిఎం ఆధర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత డా? బి.ఆర్.అంబేద్కర్ పై అవమానకరమైన వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్ షా గానీ ప్రధాని నరేంద్ర మోడీ గానీ ఇందుకు బాధ్యత వహించడానికి కానీ, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కానీ సిద్ధపడకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు రాజ్యాంగం మీద గాని, అంబేద్కర్ మీద గాని గౌరవం లేదని, అందుకే అంబేద్కర్ పట్ల ఆయన అగౌరవంగా మాట్లాడారని, అమిత్ షా ను కేంద్ర మంత్రివర్గం నుంచి భర్త చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీకి చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ పితామహుడు అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ను శిక్షించవలసిన అవసరం లేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై, అంబేద్కర్ పై మోడీకి గౌరవం ఉంటే అమిత్ షాను బర్తరఫ్ చేయాలన్నారు. మనుధర్మాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ నామాన్ని స్మరించవద్దని అమిత్ షా పార్లమెంట్లో చెప్పడం



అత్యంత దుర్మార్గం అన్నారు. అమిత్ షా, ప్రధాని మోడీ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. మనుధర్మం, కుల ధర్మాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి రమణ, జి అప్పారావు,రమణ తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మపాలెం లో చేపల వేటకి వెళ్ళి మత్స్యకారుడు మృతి

తొలి అడుగు పరవాడ డిసెంబర్ 30 : పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ దిబ్బపాలెం గ్రామానికి చెందిన కొవిరి మసేను( 30) తండ్రి కృష్ణ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో సముద్రం లో కోవిరి మసేను మరి కొందరు మత్స్యకారులు చేపల వేట చేస్తూవుండగా ప్రమాద శాత్తు సముద్రంలో గల్లంతయ్యారు.తనతో పాటు వెళ్ళిన మత్స్యకారులు వెతకగా మసేను మృతదేహం మత్స్యకారులుకి కనిపించగా అప్పటికే చనిపోయారు అని నిర్ధారణ చేసుకొని పరవాడ పోలీసులు సీఐ మల్లికార్జున రావు కి ,మత్స్యశాఖా అధికారులకి, పంచాయతీ అధికారులకి తెలియజేశారు. సంఘటన స్థలాన్ని అందరూ చేరికోని మృతదేహాన్ని శవపంచనామానికి కోసం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కి తరలించారు. ఆ పంచనామాలు అనంతరం తిరిగి ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీకి తీసుకొచ్చారు.దిబ్బపాలెం స్మశాన వాటికలో అంత్యక్రియలు లో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు,హాజరై మాట్లాడుతూ ఈ పెద మత్స్యకార మృతి పట్ల స్ధానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు , రాష్ట్ర ప్రభుత్వంతో ద్వారా మృతి ని కుటుంబానికి ఎక్సగ్రేసియా,చంద్రన్న బీమా ,పథకం మంజూరు చేయాలని కోరారు. మత్స్యకారుని అంత్యక్రియలలో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఎంపిటీసి అర్జిల్లి రవిదేవి, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు కోవిరి ముత్యాలు మరియు మృతిని కుటుంబ సభ్యులు, మరియు స్ధానిక మత్స్యకార నాయకులు , గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ముత్యాలమ్మపాలెం లో క్రికెట్ మైదానాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ : చింతకాయల

తొలి అడుగు పరవాడ డిసెంబర్ 30 : పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు యవతకి తన సొంత నిధులు తో క్రికెట్ క్విట్ అందజేశారు. మరియు క్రిడా మైదాన్నాని తన సొంత నిధులతో తాయారుచేయడం మైనది, అలాగే గ్రామంలో క్రిడా అభివృద్ధి కి సహయ సహకారులు అందిస్తామని యువతకి తెలియజేశారు. క్రిడాలు ద్వారా మన పంచాయతీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొందరు విద్యార్థులు రాణిస్తున్నారు వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా క్రీడాకారులు కూడా మన గ్రామ పంచాయతీకి మంచిపేరు తీసుకురావాలని కోరడమైనది.అనంతరం నూతన మైదానంలో క్రికెట్ మైదానాన్ని స్థానిక సర్పంచ్, ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర మత్స్యకార ప్రదాన కార్యదర్శి, పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతకాయల సూజాత ముత్యాలు ప్రారంభించారు. సోమవారం ముత్యాలమ్మతల్లి గుడి దగ్గర మైదానంలో సూజాత ముత్యాలు టాస్ వేసి మొదటి మ్యాచ్ ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల పరిచయం చేసుకుని కాసేపు బ్యాటింగ్ చేసి నిర్వాహకులను ఉత్సాహ పరిచారు , ఈ



కార్యక్రమం లో ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి ,మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న ,మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు ,మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు ,తదితరులు పాల్గొన్నారు.

# భారీగా బీమా క్లెయింల తిరస్కరణ



న్యూఢిల్లీ, తొలిఅడుగు,: ఆరోగ్య బీమా తీసుకున్నవారికి ఆసుపత్రులు గట్టి షాకిస్తున్నాయి. క్లెయిం సెటిలమెంట్లలో చాలా కొరివిలు పెడుతున్నాయి. దీంతో వేలాది కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు తిరస్కరణకు గురవుతున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,100 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింల తిరస్కరించబడ్డాయని తెలిపింది. మొత్తం క్లెయిం సెటిల్‌మెంట్లలో వీటి వాటా 12.9 శాతంగా ఉన్నదని పేర్కొంది. రూ.1.17 లక్షల కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్లలో రూ.83,493.17 కోట్లు లేదా 71.29 శాతం చెల్లింపులు జరిపారని తన వార్షికపు నివేదికలో వెల్లడించింది. వీటితోపాటు బీమా సంస్థలు రూ.10,937.18 కోట్ల క్లెయింలను తిరస్కరించగా, రూ.7,584.57 కోట్లు చెల్లింపులు జరుపాల్సివున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 3.26 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు క్లెయింలుకాగా, వీటిలో 2.69 కోట్లు(82.46 శాతం) చెల్లింపులు జరిగాయి. ఒక్కో క్లెయిం సరాసరి రూ.31,086గా ఉన్నట్లు తెలిపింది. క్లెయిం సెటిల్‌మెంట్లలో 66.16 శాతం క్యాష్‌లెస్ పద్దతిన సెటిల్ కాగా, 39 శాతం రియంబర్స్‌మెంట్ పద్దతిన జరిగాయని పేర్కొంది. 2023-24లో జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.1,07,681 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేశాయి. ప్రస్తుతం 25 జనరల్ ఇన్సూరెన్స్, 8 హెల్త్ ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్నాయిప్రభుత్వరంగ సంస్థలైన న్యూ ఇండియా, నేషనల్ అండ్ ఒరియంటల్ ఇన్సూరెన్స్‌లు హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సేవలు అందిస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 165.05 కోట్ల మంది వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. 90.10 కోట్ల మందికి ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన పథకాలైన ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన, ఐఆర్‌సీటీసీల కింద బీమా పొందుతున్నారు.

# మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 30 : నంగునూరు మండల కేంద్రంలో రామచంద్రపురం బేడబుడగ జంగాల కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పాల్గొన్నారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో నివాసం లేని కుటుంబాలకు ఇండ్లు కట్టించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ ఇంద్రమ్మ కమిటీ సభ్యులు యాదగిరి, కిషన్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు శివ గౌడ్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు నాగరాజు శ్రీకాంత్ ప్రశాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.



తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# ఘాటీలో ఘాటైన పాత్ర



తొలిఅడుగు, సినిమా :కెరీర్ బిగినింగ్‌లో గ్లామర్ పాత్రల్లో ఓ వెలుగు వెలిగింది అనుష్క. అయితే.. 'అరుంధతి' తర్వాత ఆమె నుంచి రెగ్యులర్ గ్లామర్ పాత్రలు కాకుండా, అభినయానికి ఆస్కారమున్న పాత్రల్నే ఆడియన్స్ ఆశించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె చేసిన వేదం, బాహుబలి ఫ్రాంచైజీ, రుద్రమదేవి, సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్దం, మిస్ శెట్టి %-% మిస్టర్ పోలిశెట్టి సినిమాలు ఆమెను నటిగా గౌరవప్రదమైన స్థానంలో కూర్చోబెట్టాయి. ఆ వరుసలో ఆమె చేస్తున్న మరో వైవిధ్యమైన సినిమానే 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రమని తెలుస్తున్నది. ఇందులో అనుష్క పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సమాచారం. ఇటీవల విడుదలైన టీజర్‌లో.. అనుష్క బస్‌లో ఓ వ్యక్తిని మర్డర్ చేసే సన్నివేశం సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. ట్కైమాక్స్ షూట్ మాత్రమే మిగిలివుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా నడుస్తున్నది. జనవరి చివరివారం నుంచి ట్కైమాక్స్ షూట్ ఉంటుందని తెలుస్తున్నది. ఏప్రిల్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు

# చెంచుల యువరాణిగా ప్రీతి ముకుందన్..



తొలిఅడుగు, సినిమా : ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో ప్రీతి కన్నప్ప ఇష్టసఖి, చెంచుల యువరాణి నెమలి పాత్రలో నటిస్తుంది. "అందంలో సహజం.. తెగింపులో సాహసం.. ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకి సర్వస్వం చెంచుల యువరాణి నెమలి అంటూ" ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది.

# ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగల్

తొలిఅడుగు, సినిమా :వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాపై అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు పాటలూ జనబాహుళ్యంలో బాగా వినిపిస్తున్నాయి. వందశాతం సక్సెస్‌రేట్ ఉన్న దర్శకుడు అనిల్ రావిపూడి నుంచి మరో బ్లాక్‌బస్టర్ పక్కా అని సినీ అభిమానులు ఫిక్స్ అయిపోయారు. ప్రచారంలో కూడా సినిమా దూసుకుపోతున్నది. సోమవారం గాయని రోహిణి సోరట్, భీమ్స్ సిసిరోలియోలతో కలిసి హీరో వెంకటేశ్ స్వయంగా ఆలపించిన పండుగ ప్రత్యేక గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'గొబ్బియల్లో గొబ్బియల్లో.. పండగొచ్చే గొబ్బియల్లో.. ఎవ్రీబడీ గొబ్బియల్లో.. సింగ్ దిజ్ మెలొడీ గొబ్బియల్లో.. పెద్ద పండగండి గొబ్బియల్లో.. లెట్స్ గెట్ ట్రెండీ గొబ్బియల్లో.. కమాన్.. బేసికల్లీ.. టెక్నికల్లీ.. లాజికల్లీ.. ప్రాక్టికల్లీ.. అండ్ ఫైనల్లీ.. ఇట్స్ ఏ యాటిడ్యూడ్ పొంగలూ.. ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగలూ..' అంటూ ట్రెండీగా రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. వెంకటేశ్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి



చౌదరిలపై సంక్రాంతి సంబరాల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఉపేంద్ర లిమాయే, సాయికుమార్, నరేష్, వీటీ గణేష్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీష్, సమర్పణ: దిల్‌రాజు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.



# బాపు భావోద్వేగ ప్రయాణం

తొలిఅడుగు, సినిమా :నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఓ వ్యవసాయ కుటుంబ భావోద్వేగ ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతోన్న చిత్రం 'బాపు'. నటుడు బ్రహ్మాజీ లీడ్‌రోల్ పోషిస్తున్నారు. దయా దర్శకత్వంలో రాజు, సిహెచ్ భానుప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆమని, బలగం సుధాకర్‌రెడ్డి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ, కీలక పాత్రధారులు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం నటుడు రానా దగ్గుబాటి ఆవిష్కరించారు. హాయిగా డైనింగ్ ఛైర్‌లో కూర్చుని, తనకోసం వడ్డించిన వంటకాలవైపు చూస్తున్న తండ్రిని.. ఆయన చుట్టూ గుమిగూడిన కుటుంబాన్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. చుట్టూ ఉన్న కుటుంబసభ్యుల ఎక్స్‌ప్రెషన్స్ డిఫరెంట్‌గా ఉన్నాయి. ఇది డార్క్ కామెడీ, హ్యూమర్‌తో కూడిన ఎమోషనల్ జర్నీ అనీ, మనసులను హత్తుకునేలా ఈ సినిమా ఉంటుందని, త్వరలోనే విడుదల చేస్తామని మేకర్స్ చెబుతున్నారు. మణి ఏగుర్ల, రవి చర్ల, గంగవ్వ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాసు పెండెం, సంగీతం: ఆర్.ఆర్.ధ్రువన్, నిర్మాణం: కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్.

# డబ్ల్యూటీసీ.. ఈ సారి కష్టమే!



తొలిఅడుగు,: వరుసగా రెండుసార్లు ఫైనల్, గద గెలవకున్నా రన్నరప్‌తో సరిపెట్టుకున్నాం. నిన్నా మొన్నటిదాకా పాయింట్ల పట్టికలో అగ్రస్థానం. మరో రెండు మ్యాచ్‌లు గెలిచుంటే ఇప్పటికీ ఏ ఆందోళన లేకుండా హాయిగా లార్డ్స్‌కు టికెట్ బుక్ చేసుకునేవాళ్లమే. కానీ స్వదేశంలో కివీస్ చేతిలో అవమానకర క్లీన్‌స్వీప్‌కు తోడు ఆసీస్ పర్యటనలో ఓటములు.. మెల్‌బోర్న్‌లోనూ అదే కథ. ఇంకేముంది! డబ్ల్యూటీసీలో భారత అవకాశాలు దాదాపుగా మూసుకుపోయాయి.

## జైస్వాల్ ఔట్‌పై వివాదం



తొలిఅడుగు, మెల్‌బోర్న్: ఓపెనర్ జైస్వాల్ ఔట్‌పై వివాదం నెలకొన్నది. కమిన్స్ బౌలింగ్‌లో కీపర్ క్యారీ క్యాచ్‌పై థర్డ్ అంపైర్ సైకత్ షర్ఫుదుల్లా నిర్ణయం దీనికి కారణమైంది.డ్రా కోసం ఆడుతున్న సమయంలో జైస్వాల్ క్యాచ్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్ విల్సన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆసీస్ డీఆర్ఎస్‌కు వెళ్లింది. పలుమార్లు పరిశీలించిన అంపైర్ సైకత్..బంతి బ్యాట్‌ను తాకినట్లు స్నికోమీటర్‌లో కనిపించకపోయినా ఔట్ అని ప్రకటించాడు. దీంతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు చీటర్ చీటర్ అంటూ పెద్దగా అరిచారు. దీన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా తీవ్రంగా తప్పుబట్టాడు.

## అక్షిత్ అదుర్స్
## అజేయ సెంచరీతో విజృంభణ



హైదరాబాద్, తొలిఅడుగు, : హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సీ' డివిజన్ వన్డే లీగ్‌లో మురళీ అక్షిత్ అదరగొట్టాడు. సోమవారం హైదరాబాద్ జిల్లా టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో పికెట్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 243 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన పికెట్ వికెట్ నష్టపోయి 41.5 ఓవర్లలో విజయాన్నందుకుంది. ఓపెనర్ గూడురు మురళీ అక్షిత్ (140 బంతుల్లో 146 నాటౌట్, 22ఫోర్లు) సెంచరీతో అదరగొట్టాడు. దూకుడుగా ఆడిన అక్షిత్ తన ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అంతకుముందు హైదరాబాద్ టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 242/4 స్కోరు చేసింది.

# బాక్సింగ్ డే టెస్టులో భారత్ దారుణ పరాభవం

**ఛేదించాల్సిన లక్ష్యం 340. ఆరంభంలో ముగ్గురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు వెళ్లారు. దారి చూపాల్సిన సీనియర్లు రోహిత్, కోహ్లీ, రాహుల్‌ది అదే వైఫల్య గాథ. కానీ జైస్వాల్, పంత్ పోరాటంతో గెలుపు మీద ఆశలు లేకున్నా ఓటమి గండాన్నైనా తప్పించుకోవచ్చునన్న ధీమా. మూడో సెషన్ ఆట మొదలైన కొద్దిసేపటికే పంత్ మరోసారి అనవసరపు షాట్‌కు పోయి వికెట్ పారేసుకోవడంతో ఆస్ట్రేలియా పుంజుకుంది. అక్కడ్నుంచి ఆతిథ్య జట్టు బౌలర్లు పట్టు సడలించలేదు. మూడో సెషన్‌లో 34 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 7 వికెట్లను కోల్పోయిన రోహిత్ సేన మరో ఘోర అపజయాన్ని మూటగట్టుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వచ్చింది. ఓటమితో సిరీస్ నిలబెట్టుకునే అవకాశంతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకునే అవకాశాలనూ టీమ్‌ఇండియా మరింత సంక్లిష్టం చేసుకుంది.**

తొలిఅడుగు,మెల్‌బోర్న్: ఏం మారలేదు! అదే కథ.. అదే వ్యథ! బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో వైఫల్యాల పరంపరను భారత క్రికెట్ జట్టు దిగ్విజయంగా కొనసాగిస్తూ మరో పరాభవాన్ని మూటగట్టుకుంది. మెల్‌బోర్న్ టెస్టులో రోహిత్ సేన 184 పరుగుల తేడాతో ఓడి సిరీస్‌ను నిలబెట్టుకునే అవకాశంతో పాటు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తునూ సంక్లిష్టం చేసుకుంది. ఆట చివరి రోజు ఆస్ట్రేలియా నిర్దేశించిన 340 పరుగుల ఛేదనలో టీమ్‌ఇండియా.. 79.1 ఓవర్లలో 155 పరుగులకు కుప్పకూలి దారుణ ఓటమి పాలైంది. ఛేదనలో యశస్వీ జైస్వాల్ (208 బంతుల్లో 84, 8 ఫోర్లు), రిషభ్ పంత్ (104 బంతుల్లో 30, 2 ఫోర్లు) తప్ప మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేక చతికిలపడ్డారు. ఆసీస్ బౌలర్లలో సారథి, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పాట్ కమిన్స్ (3/28), స్కాట్ బొలాండ్ (3/39), నాథన్ లియాన్ (2/37) పర్యాటక జట్టును కట్టడి చేశారు. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా సిరీస్‌లో చివరి టెస్టు మొదలుకానుంది.

వాళ్లు మారలేదు

చేయాల్సిన పరుగులు 340. ఉన్న ఓవర్లు 92. చేతిలో 10 వికెట్లు. ఛేదన తేలికైతే కాదు గానీ అసాధ్యమైతే కాదు. ఆరంభంలో వికెట్ కాపాడుకుని తర్వాత బ్యాట్ ఝుళిపిస్తే గెలిచే అవకాశాలు మెరుగయ్యేవి. అందుకు తగ్గట్టుగానే భారత ఇన్నింగ్స్ కూడా నెమ్మదిగానే మొదలైంది. మొదటి 16 ఓవర్లకు భారత్ చేసిన స్కోరు 25/0. తన స్వభావానికి విరుద్ధంగా షాట్ల జోలికి పోకుండా 39 బంతుల్లో 9 పరుగులే చేసిన కెప్టెన్ రోహిత్ శర్మ.. కమిన్స్ వేసిన ఫుల్ డెలివరీని ఆడబోయి గల్లీలో మార్ష్‌కు క్యాచ్ ఇవ్వడంతో వికెట్ల పతనం మొదలైంది. అదే ఓవర్లో కమిన్స్.. కేఎల్ రాహుల్‌నూ డకౌట్‌గా వెనక్కి పంపి భారత్‌కు డబుల్ షాకిచ్చాడు. యావత్ భారత క్రికెట్ అభిమానులు గంపెడాశలు పెట్టుకున్న ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (5) మరోసారి చేతులెత్తేశాడు. దీంతో లంచ్‌కు ముందే భారత్ 33/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఆదుకున్న యశస్వీ, పంత్

8 పరుగుల వ్యవధిలో 3 కీలక వికెట్లు కోల్పోవడంతో భారత్ ఆత్మరక్షణలో పడింది. యశస్వీకి జతకలిసిన పంత్.. అనవసరపు షాట్ల జోలికి పోకుండా డిఫెన్స్‌నే ఆశ్రయించారు. రెండో సెషన్ ఆసాంతం ఈ ద్వయం కంగారూ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంది. ఈ క్రమంలో యశస్వీ.. లియాన్ వేసిన ఓవర్లో బౌండరీతో 127 బంతుల్లో అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. టెస్టులలో అతడికిది రెండో నెమ్మదైన హాఫ్ సెంచరీ. పంత్‌ను ఔట్ చేసేందుకు ఆసీస్ బౌలర్లు ఊరించే బంతులేసినా అతడు ఏకాగ్రత కోల్పోలేదు. రెండో సెషన్‌లో ఈ జోడీ 27.5 ఓవర్లు ఆడి 79 పరుగులు చేసింది.

34 పరుగుల వ్యవధిలో 'ఖేల్' ఖతం



యశస్వీ, పంత్ పట్టుదలతో డ్రా దిశగా సాగుతున్న భారత ఇన్నింగ్స్ మూడో సెషన్ తర్వాత కుదుపునకు లోనైంది. థర్డ్ సెషన్‌లో హెడ్ వేసిన 59వ ఓవర్లో నాలుగో బంతిని భారీ షాట్ ఆడబోయిన పంత్.. లాంగాన్ వద్ద మార్ష్ డైవింగ్ క్యాచ్‌తో క్రీజును వీడాడు. భారత ఓటమికి బీజం పడిందిక్కడే. ఆ తర్వాత 20 ఓవర్లలోపే టీమ్‌ఇండియా ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (1), సీనియర్ బ్యాటర్ రవీంద్ర జడేజా (2) అలా వచ్చి ఇలా వెళ్లారు. వాషింగ్టన్ సుందర్ (45 బంతుల్లో 5 నాటౌట్)తో కలిసి ఏడు ఓవర్ల పాటు వికెట్ కాపాడుకున్న యశస్వీ.. కమిన్స్ వేసిన 71వ ఓవర్లో థర్డ్ అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో వెనుదిరిగాల్సి వచ్చింది. లోయరార్డర్ బ్యాటర్లూ పోరాడకపోవడంతో భారత్.. 155 పరుగులకు ఆలౌట్ అయింది. ఒక దశలో 121/3తో పటిష్ఠంగా ఉన్న రోహిత్ సేన.. 34 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474 ఆలౌట్‌బీ

భారత్ తొలి ఇన్నింగ్స్: 369 ఆలౌట్‌బీ

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 234 ఆలౌట్‌బీ

భారత్ రెండో ఇన్నింగ్స్: 79.1 ఓవర్లలో 155 ఆలౌట్ (జైస్వాల్ 84, పంత్ 30, కమిన్స్ 3/28, బొలాండ్ 3/39)